ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
ఆదివారం, 7 జూలై 2024 www.prajaaswaramdaily.com 4 PM

# ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు చంద్రబాబు



హైదరాబాద్, జూలై 7 (ప్రజాస్వరం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు చేరుకున్నారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసం నుంచి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వరకు కార్యకర్తలతో భారీ ర్యాలీగా సాగారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ట్రస్ట్ భవన్ కు వచ్చిన చంద్రబాబుకు తెలంగాణ టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం భేటీ అయిన విషయం తెలిసిందే. అనంతరం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో చంద్రబాబు విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు దారి పొడవునా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తలు, అభిమానుల కేరింతల నడుమ చంద్రబాబు ఎన్టీఆర్ భవన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉందని పేర్కొన్నారు. పెద్ద రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌ను దాటుకొని తెలంగాణ అగ్రభాగాన ఉందని కొనియాడారు.




# వస్తున్నాయ్.. జగన్నాథ రథచక్రాలు

## కిక్కిరిసిన పూరీ వీధులు.. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు



పూరీ, జూలై 7 (ప్రజాస్వరం): ఒడిశాలోని పూరీలో విశ్వప్రసిద్ధ జగన్నాథుడి రథయాత్ర కోలాహలం నెలకొంది. ఆ రాష్ట్రంతో పాటు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో పూరీ కిక్కిరిసిపోయింది. జై జగన్నాథ్, హరిబోల్ నామస్మరణతో అక్కడి వీధులన్నీ మార్మోగుతున్నాయి. రథయాత్ర సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు రత్నసింహాసనంపై చతుర్ధామూర్తులు కొలువు దీరారు. అనంతరం జగన్నాథుని నవయవ్వన రూపాలంకరణ జరిగింది. మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ, గోపాలవల్లభ సేవల తర్వాత 10 గంటలకు నేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు పూరీ రాజు గజపతి దివ్యసింగ్ దేవ్ రథాలపై చెరాపహరా (చీపురుతో రథాల ముందు ఊడ్చడం) చేస్తారు. సాయంత్రం 4 గంటలకు రథాలకు సారథులు, అశ్వాలు అమర్చి తాళ్లు కడతారు. 5 గంటలకు తొలుత బలభద్రుని తాళధ్వజ రథం లాగుతారు. తర్వాత దేవీ సుభద్ర దర్పదళన్, చివరిగా పురుషోత్తముని నందిఘోష్ రథం తల్లి సన్నిధికి బయలుదేరుతుంది. భక్తజన ఘోషలో పూరీ బొడొదండోలో నందిఘోష్ రథంపై జగన్నాథుడు దర్శనమివ్వనున్నాడు. యాత్రను నిర్విఘ్నంగా జరిపించడానికి శ్రీక్షేత్ర యంత్రాంగం, ఒడిశా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేశాయి. తొలిసారి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఉత్సవంలో పాల్గొననున్నారు. ఆమె గవర్నర్ రఘుబర్ దాస్ తో కలిసి సుభద్రమ్మ రథం లాగుతారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. రెండురోజుల రథయాత్రలో 15 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. దీన్ని దృష్టిలో ఉంచుకొని పూరీ పట్టణానికి మూడంచెల భద్రత కల్పించారు.



# అమ్మ బైలెల్లినాదో..

## బోనమెత్తిన గోల్కొండ



### జగదాంబికా ఆలయం వద్ద బోనాల సందడి

### బోనాలతో తరలివచ్చిన మహిళలు

హైదరాబాద్, జూలై 7 (ప్రజాస్వరం): గోల్కొండలోని జగదాంబికా అమ్మవారి ఆలయం వద్ద బోనాల సందడి నెలకొంది. మహిళలు పెద్దఎత్తున బోనాలతో అక్కడికి చేరుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. డప్పు చప్పుళ్లు, తీన్మార్ దరువులతో ఆ ప్రాంతమంతా మార్మోగుతోంది. పోతరాజుల వీరంగాలు, శివసత్తుల ఆటలతో జాతర శోభ సంతరించుకుంది. దశాబ్ది బోనాల వేడుకల పేరుతో ఈ సారి ప్రభుత్వం బోనాలను మరింత శోభాయమానంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. రూ.20 కోట్ల నిధులను కేటాయించింది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి నేటి నుంచి ఆషాఢమాసం మొత్తం గురు, ఆదివారాల్లో బోనాలను నిర్వహించనున్నారు. అమ్మవారికి మొత్తం 9 వారాలు... 9 పూజలు ప్రత్యేకంగా చేస్తారు.

### నేడు తొలిపూజ

నేడు తొలిపూజ కావడంతో ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు లంగర్ హౌస్ నుంచి ఊరేగింపుగా వెళ్లి... చోటాబజార్‌లోని పూజారి ఇంట్లో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం బంజారా దర్వాజ వైపు నుంచి నజర్ బోనంతో అమ్మవారి ఊరేగింపు గోల్కొండ కోటకు చేరుకుంటుంది. ఆలయంలో అమ్మవారి ఘటాలను ఉంచిన తరువాత భక్తులు బోనాలు ఎక్కిస్తారు. నేటి నుంచి ఆగస్టు 4 వరకు గోల్కొండలో బోనాల ఉత్సవాలు కొనసాగనున్నాయి. అనంతరం ఈ నెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి.. 28, 29 తేదీల్లో లాల్



దర్వాజా బోనాలు జరగనున్నాయి.

### దద్దరిల్లుతున్న గోల్కొండ

హైదరాబాద్ నగరంలో ఆషాడ మాసం తొలి బోనం గోల్కొండలోని జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించారు. మంత్రి కొండా సురేఖ, మేయర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. దాదాపు లక్షకు పైగా పాల్గొననున్న ఈ బోనాల జాతరకు పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు తొలి బోనం సమర్పించనుండగా..ఇప్పటికే గోల్కొండ పరిసర ప్రాంతాల్లో సందడి మొదలైంది. పొతరాజులు విన్యాసాలు, డోలు సప్పుడు, శివసత్తుల బోనాల ఊరేగింపులతో పాతబస్తి దద్దరిల్లిపోతోంది. ఈ రోజు గోల్కొండకు మొయినాబాద్, చేవెళ్ల, కాళీ మందిర్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన తర్వాత తొలి బోనం అమ్మవారికి అందించనున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి తమ బోనాలు సమర్పిస్తారు. అంగరంగ వైభవంగా జరిగే ఈ కార్యక్రమాన్ని చూడటం కోసం పెద్ద ఎత్తున సందర్శకులు భక్తులు తెల్లవారేసరికి గోల్కొండకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం కోలాహలంగా మారిపోయింది.



# ఎస్సై మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో



హైదరాబాద్, జూలై 7 (ప్రజాస్వరం): ఆత్మహత్య యత్నానికి పాల్పడి హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు సిఐ జితేందర్ రెడ్డిని సస్పెండ్ చేసి రిమాండ్ చేయాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారో పాల్గొన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సై మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు. ఎస్సై భార్యకు గ్రూప్ 2 ఉద్యోగం, ఐదు ఎకరాల భూమితో పాటు రాజీవ్ గృహం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, రజాతన పాల్గొన్నారు.